# శిక్ష లేని నేరం



వెళ్ళిపోతున్న రోగిని, వీధి చివరికంటా చూసి, గట్టిగా నిట్టూర్పువిడిచాడు మాధవరావు. మనస్సంతా చిరాగ్గాఉంది. ఎంత అణిచిపెట్టుకుందామన్నా, పాతజ్ఞాపకాలు పదేపదే చెలరేగి. గుండెను పిండివేస్తున్నాయి.

డాక్టరు ఎప్పుడు కులాసాగా వుంటాడో, ఎప్పుడు చిరచిరలాడుతుంటాడో, కాంపౌండరుకూ, నర్సులకూ తెలుసు. తెలుసనంటే, మాధవరావు కేకలేస్తాడనికాదు. అతను సాధారణంగా పెదవికదపడు. అధవా మాట్లాడినా, రోగులతోనే తప్ప, సిబ్బందితో మాట్లాడ వలసిన సందర్భాలు బహు తక్కువగాఉంటాయి. తన అనుభూతు లన్నింటినీ, లో లోపలనే దాచుకుంటాడు గాని, బయటపడడు. అతని కళ్ళను చూసి, చలించే వ్రేళ్ళను చూసి డాక్టరు ఎలావున్నదీ వాళ్ళు గ్రహిస్తారు.

రోగులందరూ వెళ్ళిపోయారు. మందుమాకులు సర్దుడయిపోయింది. కుర్రవాడొచ్చి, బల్లలూ కుర్చీలు తుడిచివేశాడు. మురికి బొక్కెనను దూరంగా తీసుకెళ్ళి పరిశుభ్రం చేశాడు.

నిజానికి, రోజూ అదే సమయానికి డాక్టరుకూడా ప్రయాణ సన్నాహంలో ఉంటాడు. కాని ఈ రోజున మాత్రం మాధవరావు కదిలే చిహ్నాలేవీ కనిపించడంలేదు. బల్ల మీదకు ముఖం ఆనించి, ముఖానికి అటూ ఇటూ రెండుచేతులూ వుంచుకొని, నిశ్శబ్దంగా వుండిపోయాడు. ఆయన్ను పలకరించడానికి భయం! ఏమంటే ఏం కొంపమీదికొస్తుందోనని హడలు! అలాగని ఎంతసేపు వుండిపోవడం?

ఆఖరుకు ధైర్యంచేసి, ఒక కాంపౌండరు గారు తలుపును కొద్దిగా చప్పుడు చేశాడు. రానిదగ్గును దగ్గి, డాక్టరు దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నించాడు. మాధవరావు తలెత్తిచూశాడు. అతని ముఖమంతా కందగడ్డలా ఉంది. కన్నులలో నీటిపొరలు కదలాడుతున్నాయి.

డాక్టరుకూడా, ఎదురుగా నుంచున్న సిబ్బందిని చూసి, ఓ క్షణం కాలం విస్తుపోయాడు. వెంటనే గడియారం కేసి చూశాడు. పది నిముషాలకు తక్కువగా వొంటిగంటయింది. నిజానికి వాళ్లు పన్నెండున్నరకే వెళ్ళివుండవలసింది. ఒకసారి తన ముందున్న రిజిస్టరును చూసి, తలతోనే వెళ్ళమన్నట్లు సౌంజ్ఞ చేశాడు మాధవరావు. తిరిగి ముఖాన్ని చేతులమధ్య దాచుకొన్నాడు...

రిజిస్టరులో చిట్టచివర రాసిన పేరు, కళ్ళముందు నాట్యం చేస్తున్నది. ఆ అక్షరాలను, పదేపదే చూశాడు. వాటినిఆప్యాయంగా, వేళ్ళతోనిమిరాడు. దుఃఖం కట్టలు తెంచుకొని పెల్లుబుకుతున్నది. పెదవులు బిగబట్టి శోకాన్ని మింగడానికి ప్రయత్నిస్తున్నాడుమాధవరావు.

ఎంతకాలమైతే నేం గాని, ఆ సంఘటనను తను ఇంకా మరిచిపోలేదు. మరిచి పోలేడుకూడా.

తను కొత్తగా ప్రాక్టీసు ప్రారంభించిన రోజులు. చదువుకొంటున్న రోజుల్లో, తనెన్నో కలలుగన్నాడు. ఎన్నెన్నో ఊహించాడు. వాటి నన్నిటినీ, అక్షరాలా అమలుజరపాలనుకొన్నాడు. డాక్టరుగా తను చేయదలచుకొన్నది చాలా ఉంది.

ఈ దిక్కుమాలిన ప్రపంచంలో, బాధితులకు కొదవలేదు. వ్యాధులకూ, వ్యాధిపీడితులకూ అంతకన్నా కొదవలేదు. వారిలో కొంతమంది - బహుశా - చాలా ఎక్కువ మంది - ఆర్థికంగా అతి నికృష్టమైన పరిస్థితుల్లో జీవించుతూ వుండవచ్చు. సాధారణంగా అలాంటివారికి వైద్య సదుపాయాలు అందు

బాటులో వుండవు. కాని తన ఆసుపత్రిలో వారందరికీ ఆదరణ లభిస్తుంది. కన్నీళ్ళతో తన దగ్గరకొచ్చిన రోగులు, చిరునవ్వులతో తిరిగి వెళ్ళిపోవాలి. అదే తన ఆశయం, ఇందువల్ల, తనకెంత ఆదాయ ముంటుందన్నది ప్రశ్నకానేకాదు కేవలం ఈ వృత్తిమీదనే తను జీవించాలనికూడా లేదు. తన తాత ముత్తాతలు ఆర్జించిన ఆస్తి ఉంది. తన తండ్రి, ఇంకా రెండుచేతులా ఆర్జించిపోస్తూనే ఉన్నాడు. సంపాదిస్తున్న వాళ్ళను సంపాదించనీ! ఆ వెసులుబాటులో తను చేయగలిగినంత సేవనూ-తనచుట్టూవున్న వారికి చేస్తాడు.

ఆసుపత్రిని ప్రారంభించిన తొలిరోజున, తన ఆశయాలేమిటో నలుగురికీ చెప్పినప్పుడు, ఇవేవో లాంఛనంగా అంటున్న మాటలనే చాలా మంది అనుకొని వుండవచ్చును. అలాగని కొందరు తనతో అన్నారు కూడాను. తనేమీ కోపగించుకోలేదు. లోలోపల రవ్వంత బాధపడ్డాడు. తను కేవలం వాక్శూరుడు మాత్రమే కాదనీ, కార్యశూరుడుకూడా ననీ, రుజువుచేసుకోవాలి. ఈ ప్రయత్నంలో ఎన్నో ఇబ్బందులూ, సబ్బందులూ వుంటాయని కూడా తను ముందుగానే ఊహించాడు. అన్నింటినీ, చాలా ఓర్పుతో భరిస్తూ వచ్చాడు.

అతి దుర్మార్గం పనికిరానట్లే, అతి మంచితనం, అతి నిజాయితీ కూడా పనికిరావన్న సత్యం, చాలా కాలం తరువాతగాని, తను గ్రహించలేకపోయాడు. అయితే-ఈ సత్యాన్ని గ్రహించేందుకు, తను చెల్లించిన మూల్యం మాత్రం సామాన్యమైనది కాదు.

సూరిని చూస్తూనే వాడి జబ్బేమిటో తను గ్రహించాడు. అసలెప్పుడో దానికి చికిత్స జరిగివుండవలసింది! కాని జరగలేదు. సూరి కూడా, ఏదో నలతగా ఉందని గొణుగుతుండేవాడేగాని, తన బాధేమిటో ఎప్పుడూ చెప్పలేదు. తండ్రికూడా పట్టించుకోలేదు. అధవా పట్టించుకొన్నా, చికిత్స చేయించి వుండడు. నెలరోజుల చాకిరీకి, రెండువందల పదకొండు రూపాయల జీతం తెచ్చుకొనే సామాన్యుడు తన కొడుక్కు ఖరీదైన చికిత్స లేం చేయిస్తాడు గనక? అతని సంపాదన తెలిశాక, మాధవరావు కడుపు తరుక్కుపోయింది. వ్యక్తుల రాబడినిబట్టి, వ్యాధులొచ్చే సదుపాయమే వుంటే, ఎంత బాగుంటుందో ననిపించింది తనకు. తాను ఉచితంగా వైద్యం చేస్తాననీ, మందులు మాత్రం కొని తెచ్చుకోమనీ, సూరితండ్రితో డాక్టరు చెప్పినప్పుడు, ఆ మానవుడు పొందిన ఆనందం ఇంతా అంతా కాదు. సంతోషాన్ని ఆపుకోలేక, అతగాడు తన పాదాలు పట్టుకోబోయాడు. ఇతరుల దగ్గరకు కూడా అతడు వెళ్ళాడట! కాని ఆ ఖర్చులను భరించలేక యిలా వచ్చాడట!

ప్రమాదకరమైన ఆ వ్యాధి, అప్పటికే సూరిని పూర్తిగా ఆక్రమించింది. వ్యాధిక్రిములు అతని రక్తాన్ని కలుషితం చేశాయి. ఊపిరితిత్తులు బలహీనపడి పోయాయి. గుండె నీరసంగా పనిచేస్తున్నది!

సూరిని చూస్తూనే ఈ పాపిష్టివ్యాధి ఈ కుర్రవాడి కెందుకు దాపరించిందా అనిపించింది తనకు. నిండా చూస్తే పదమూడేళ్ళు లేవు. తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చాకులాంటివాడు. తెలివితేటలతో మిలమిలలాడే కళ్ళమీదికి, అందంగా తల వెంట్రుకలు జారుతుంటే, చూడముచ్చటగా వుండేది

తనెలాగైనా, సూరిని బ్రతికించి తీరా లనుకొన్నాడు. వాడిలాంటి చురుకైనవాళ్లు, తెలివైనవాళ్ళూ, పది కాలాలపాటు బ్రతికి బట్టగడితే, ఈ సమాజానికి ఎంతైనా ఉపయోగపడతా రనుకొన్నాడు. అహర్నిశలూ, ఆ వ్యాధితో పోరాటం కొనసాగించాడు. అవసరానికి సూరి తండ్రి మందులు తీసుకొనిరానప్పుడు, తనే కొని వాడాడు. అసలే కొడుకు జబ్బుతో కుంగిపోయిన వాణ్ని-ఈ మందుల బెడదతో మరింత బెంబేలెత్తేలా చేయడం, తనకెంతమాత్రం ఇష్టంలేదు.

వ్యాధి కూడా మొండికెత్తిపోయింది. ఒక్కోసారి అది తగ్గుముఖం పట్టేది. మరోసారి ఉధృతంగా ఉండేది. అందరూ ఆశలు వదలుకొనేవారు. కాని తనకు మాత్రం ఏ మూలనో ఆశ మిణుకుమిణుకుమంటూ కనిపించేది. తనకూ వ్యాధికీ మధ్య జరిగిన సంగ్రామానికి సూరి యుద్ధరంగ మయ్యాడు.

వ్యాధి క్రమక్రమంగా తగ్గుతున్న దశలో, సూరితండ్రి తన దగ్గరకొచ్చాడు. సూరిహఠాత్తుగా నెత్తురు కక్కుకుంటున్నాడనీ, మాట కూడా నీరసపడిపోయిందనీ లబోమన్నాడు. ఆ దశలో వాడవలసిన మందు, తన దగ్గర లేదు. సూరి తండ్రిని పంపించి, తాను బజారుకు బయల్దేరాడు. కొంతమంది దగ్గర ఆ మందు లేదు. ఉన్న వారు-అసలు ఖరీదుకు రెండురెట్లు డబ్బు చెల్లించమన్నారు. తనేమి చేయడం ప్రజల ప్రాణాలతో చెలగాటాలాడే హక్కు ఈ వ్యాపారస్తుల కెవ్వ రిచ్చారు? తాను పోలీసులకు రిపోర్టు చేశాడు. డ్రగ్ ఇన్స్పెక్టరుకు కబురుపెట్టాడు. గొడవయింది. దుకాణం వున్నపాళాన మూసి వేయబడింది. నిమిషాలపైన దొరకవలసిన మందు గంటలమీద గాని దొరకలేదు. మందు తీసుకొని సూరి దగ్గర కొచ్చాడు మాధవరావు. అసలు-అల్లంత దూరంలో ఉండగానే, పెద్దగా ఏడుపులు వినిపించి. తాను కంగారుపడ్డాడు. తీరా వెళ్ళి చూసేసరికి, సూరి శరీరం నిర్జీవంగా పడి ఉన్నది.

కనీసం ఒక అరగంటైనా, తాను ముందొచ్చినట్లయితే ఎంత బావుండేది? ఏదో ఒక ధరకు ఆ మందును కొని వాడి నట్లయితే, సూరి నిస్సందేహంగా జీవించి ఉండేవాడే! తనొక అన్యాయాన్ని రూపు మాపేందుకు చేసినప్రయత్నంలో, అంతకన్నా ఘోరమైన నేరాన్ని చేశాడు. ఒక నిండుప్రాణాన్నే అందుకు బలిపెట్టాడు!

మాధవరావు కన్నీటితో బల్లమీది అద్దం పూర్తిగా తడిసిపోయింది.